నేడు విద్యుత్‌ సరఫరా ఉండని ప్రాంతాలు

బోడుప్పల్‌: సమ్మర్‌ యాక్షన్‌ పనుల నేపథ్యంలో పలు కాలనీల్లో గురువారం విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ వేణుగోపాల్‌ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాఘవేంద్రకాలనీ, సాయి మారుతీనగర్‌, కేశవనగర్‌, ఆకృతి టౌన్‌షిప్‌, ఈస్ట్‌ బాలాజీహిల్స్‌, బాలాజీహిల్స్‌, పద్మావతికాలనీ, స్వరూప్‌నగర్‌, వెస్ట్‌ బాలాజీ హిల్స్‌, ఈస్ట్‌ బృందావన్‌ కాలనీ, వెస్ట్‌ బృందావన్‌ కాలనీ, శ్రీనివాస్‌ కాలనీ, సత్తిరెడ్డి కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్‌ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

11 కేవీ చెంగిచర్ల పరిధిలో..

మేడిపల్లి: 11 కేవీ చెంగిచర్ల పరిధిలో గురువారం విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ హరినాథ్‌ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పీఅండ్‌టీకాలనీ, కమలానగర్‌, విశ్వవిహార్‌, సుమ రెసిడెన్సీ, గురుఎన్‌క్లేవ్‌, అయోధ్యకాలనీ, భగత్‌సింగ్‌ కాలనీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. అలాగే మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాయి రెసిడెన్సీ, వెంకటాద్రినగర్‌, ఆదర్శనగర్‌, ఆర్టీసీ కాలనీ, హిమగిరి కాలనీ, ప్రశాంత్‌నగర్‌, రంగరంగయ్య కాలనీల్లో విద్యుత్‌ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

అల్వాల్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో..

అల్వాల్‌: ఫీడర్ల మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదని అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అల్వాల్‌ సబ్‌స్టేషన్‌ 11కేవీ భూపతిరావునగర్‌ ఫీడర్‌ పరిధిలో భూపతిరావునగర్‌, శక్తిగణేష్‌నగర్‌, అల్వాల్‌ హిల్స్‌ లో ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు. అదేవిధంగా 11కేవీ హెచ్‌ఎంటీ ఆఫీసర్స్‌ కాలనీ ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 వరకు హెచ్‌ఎంటీ, పంచశీల్‌ ఎన్‌క్లేవ్‌. అలాగే మచ్చబొల్లారం సబ్‌స్టేషన్‌ 11కేవీ సాయిరెడ్డినగర్‌ ఫీడర్‌ పరిధిలో సాయిరెడ్డినగర్‌, శ్రీసాయి కాలనీ, చేతన్‌హౌసింగ్‌ కాలనీ, కావేరీ ఎన్‌క్లేవ్‌, స్నేహకాలనీ ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదని వారు తెలిపారు.

చిన్నారితో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

ఘట్‌కేసర్‌: చిన్నారితో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై ఘట్‌కేసర్‌ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలో ఐదేళ్ల చిన్నారిని కావటి శ్రీధర్‌ (21) అనే యువకుడు మంగళవారం రాత్రి సమీపంలోని ఇంటి సమీపంలోని పొదల్లోకి తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. స్థానికులు గమనించి అతడిని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. అనంతరం కుటుంబ సభ్యులు పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆలయంలో హుండీ చోరీ



సీసీ కెమెరాల్లో నిందితుడి దృశ్యం

ఘట్‌కేసర్‌: మర్పల్లిగూడ దుర్గామాత ఆలయంలోని హుండీని గుర్తు తెలియని దుండగుడు బుధవారం తెల్లవారుజామున ఎత్తుకెళ్లాడు. సమీపంలోని డంపింగ్‌ యార్డులోకి తీసుకెళ్లి హుండీని పగులగొట్టి నగదు దోచుకెళ్లాడు. ఆలయంలోని సీసీ కెమెరాల్లో నిందితుడి దృశ్యాలు రికార్డు అయ్యాయి. హుండీలో ఎంత నగదు పోయిందనేది తెలియరాలేదు. దీంతో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

నిజాం కాలేజీలో యూజీసీ న్యాక్‌ బృందం పర్యటన

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అనుబంధ నిజాం కాలేజీని యూజీసీ న్యాక్‌ అధికారుల బృందం ఈ నెల 24, 25 తేదీలలో పర్యటించినట్లు అధికార వర్గాలు బుధవారం తెలిపారు. న్యాక్‌ గుర్తింపు కోసం కాలేజీ పనితీరు, నాణ్యత ప్రమాణాలను అంచనా వేసి గుర్తింపు ఇచ్చేందుకు అధికారుల బృందం పర్యటించిందని పేర్కొన్నారు. ప్లేస్‌మెంట్‌ సెల్‌, ఎన్‌ఎస్‌ఎస్‌, ఎన్‌సీసీ, ఈఓసీ, పరీక్షల విభాగం, విమెన్‌ ఎంపవర్‌మెంట్‌ సెల్‌, క్రీడా విభాగంతో పాటు ఆర్ట్స్‌, సోషల్‌ సైన్స్‌, కామర్స్‌, సైన్స్‌, మేనేజ్‌మెంట్‌ కోర్సుల విభాగలను సందర్శించి అధ్యాపకులతో మాట్లాడినట్లు ప్రిన్సిపల్‌ ప్రొ.ఏవీ రాజశేఖర్‌ తెలిపారు.

విద్యుత్‌ సమస్యలు రానివ్వొద్దు

సైదాబాద్‌: వేసవిలో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సైదాబాద్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆమె సంబంధిత అధికారులతో కలిసి డివిజన్‌లోని కరణ్‌బాగ్‌ కాలనీలో పర్యటిస్తూ వీధి దీపాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. శిథిలావస్థకు చేరిన విద్యుత్‌ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ దుర్గారావు పాల్గొన్నారు.



సహస్రలింగేశ్వర ఆలయంలో భక్తులు..



శివపార్వతుల కల్యాణంలో ఆలయ కమిటీ సభ్యులు..



అర్ధనారీశ్వర అలంకరణలో అమ్మవారు

వైభవంగా మహాశివరాత్రి

ఉప్పల్‌, మల్కాజిగిరి నియోజకవర్గాల వ్యాప్తంగా వేడుకలు

- ఉదయం నుంచే ఆలయాలకు భక్తుల క్యూ
- అభిషేకాలు, ప్రత్యేక పూజలు
- శివనామ స్మరణతో మార్మోగిన టెంపుల్స్‌
- కనుల పండువగా శివపార్వతుల కల్యాణం

ఉప్పల్‌, మల్కాజిగిరి నియోజకవర్గాల వ్యాప్తంగా బుధవారం మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. భక్తులు ఉదయం నుంచే శివాలయాలకు క్యూ కట్టారు. హరోం హర.. శంభో శంకర అంటూ భక్తుల శివనామ స్మరణతో ఆలయాలు మార్మోగాయి. కొందరు భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టి జాగరణ చేశారు. అదేవిధంగా శివపార్వతుల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ప్రముఖులు, రాజకీయ నాయకులు ఆలయాల్లో స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. –ఉప్పల్‌, మల్కాజిగిరి జోన్ల బృందం



అలంకరణలో సహస్రలింగేశ్వరుడు



ఉప్పల్‌ స్వరూప్‌ నగర్‌ శివాలయానికి పోటెత్తిన భక్తులు



రామంతాపూర్‌ మల్లికార్జున స్వామి ఆలయంలో కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



శివాలయంలో రథోత్సవం..



మల్లాపూర్‌ నందీశ్వరాలయంలో కల్యాణం..



ఉప్పల్‌ వెలుగుట్ట ఆలయంలో అలంకరణ ..



మల్లికార్జుననగర్‌ మల్లన్న ఆలయంలో..



నేరెడ్‌మెట్‌ కాశీ విశ్వనాథాలయంలో మెజిస్ట్రేట్‌ అరుణ్‌ తేజ్‌స్వామి పూజలు..



కానాజీగూడలోని మరకత లక్ష్మీగణపతి దేవస్థానంలో ..



ఇందిరానెహ్రునగర్‌ ప్రసన్నాంజనేయ సన్నిధి శివాలయంలో..

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఉప్పల్‌: మహాశివరాత్రిని పురస్కరించుకుని ఉప్పల్‌ మినీ శిల్పారామంలో బుధవారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్కూల్‌ ఆఫ్‌ పెర్ఫార్మింగ్‌ ఆర్ట్స్‌ డా. సాయి జీవన బృందం నిర్వహించిన కథక భరత నాట్య ప్రదర్శనలు అలరించాయి. గణేశ్‌ వందన, కాళీకౌతం, అభినయ్‌ గీత్‌, కీర్తనై, తులసీదాస్‌ భజన, వర్ణం, సరస్వతి, శివ కై లాసానికి తదితర అంశాలను కళాకారులు ప్రదర్శించారు.



నృత్యం చేస్తున్న కళాకారులు

1న మాదిగ అమరవీరుల సంస్మరణ సభ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో మార్చి 1న మాదిగ అమరవీరుల సంస్మరణ సభను నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్‌ రాష్ట్ర అధ్యక్షులు డా.గోవిందు నరేష్‌ తెలిపారు. బుధవారం (ఎంఎస్‌ఎఫ్‌) నాయకుల సమావేశం జరిగింది. కార్యక్రమానికి ఎంఎస్‌ఎఫ్‌ ఓయూ అధ్యక్షులు మంద రాజు మాదిగ అధ్యక్షత వహించగా గోవిందు నరేష్‌ ముఖ్యఅతిథిగా హాజరై పలు అంశాలపై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణలో రిజర్వేషన్ల కేటాయింపులు శాస్త్రీయంగా జరగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్‌ జాతీయ అధ్యక్షులు చిప్పలపల్లి సోమశేఖర్‌ మాదిగ, అధికార ప్రతినిధి బోర్ర భిక్షపతిమాదిగ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోవిందు నరేష్‌ మాదిగ

బీసీ హాస్టళ్లలో సమస్యల పరిష్కారానికి కృషి



వనస్థలిపురం: సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను సంబంధిత మంత్రి పొన్నం ప్రభాకర్‌ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్‌ మధుయాష్కీగౌడ్‌ అన్నారు. మంగళవారం రాత్రి వనస్థలిపురంలోని బీసీ సంక్షేమ హాస్టల్‌ను ఆయన సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఫ్యాన్లు, లైట్లు లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థుల చదువుకు ఆటంకం కలుగుతున్న నేపథ్యంలో తమ ఫౌండేషన్‌ ద్వారా 48 గంటల్లో ఫ్యాన్లు, లైట్లు, అత్యవసర వస్తువులు అందిస్తామని హామీ ఇచ్చారు. హాస్టల్‌ భవన యజమానితో మాట్లాడి కొత్త తలుపులు, కిటికీలు, బాత్రూమ్‌ల మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హస్తినాపురం కార్పొరేటర్‌ బానోతు సుజాతానాయక్‌, నాయకులు చెన్నగోని రవిందర్‌గౌడ్‌, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, దాము మహేందర్‌ యాదవ్‌, కొండోజు శ్రీనివాస్‌, అంతటి శ్రీనివాస్‌గౌడ్‌ పాల్గొన్నారు.

గృహిణి అదృశ్యం

నాగోలు: మహిళ అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో జరిగింది. ఎస్సై శివనాగ ప్రసాద్‌ వివరాల ప్రకారం. సూర్యాపేట జిల్లా తుంగతుర్తికి చెందిన కొమ్ము సురేష్‌, జయమ్మ (34) దంపతులు. బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన నాగోలు శ్రీనివాస కాలనీలో ఉంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం భార్యాభర్తల నడుమ ఆర్థిక పరమైన విషయంలో గొడవ జరిగింది. మనస్తాపం చెందిన జయమ్మ తాను చని పోతానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో సురేష్‌ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

డ్రైనేజీ పైప్‌లైన్‌కు మరమ్మతు

మల్లాపూర్‌: నాచారం డివిజన్‌ పరిధిలో డ్రైనేజీ పైప్‌లైన్‌ పగిలి ఇళ్లలోకి డ్రైనేజీ చేరుతోంది. దీంతో ఎర్రకుంటకు చెందిన సామాజిక వేత్త గద్ద క్రాంతి కిశోర్‌ ఈ సమస్యను జలమండలి అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. స్పందించిన అధికారులు మరమ్మతులు చేపట్టారు. దీంతో స్థానికులు జలమండలి మేనేజర్‌ సిరాజుద్దీన్‌, గద్ద క్రాంతి కిశోర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



ఆస్తి పన్ను హైప్‌..!

సాక్షి,సిటీబ్యూరో: పురపాలికల్లో ఆస్తి పన్ను మదింపునకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో 2025–26 ఆర్థిక సంవత్సరంలో నూతన విధానం అమలు కానున్నది. ఈ మేరకు మున్సిపాలిటీల పరిధిలోని వ్యవసాయేతర ఆస్తుల విలువలు సవరించి ఆస్తి పన్ను విధించనుండగా, ఎంత పన్ను పెరగనున్నదో వివరాలు సేకరించే పనిలో పుర అధికారులు నిమగ్నమయ్యారు.

ఖాళీ స్థలాలపై పన్ను

నగర శివారు పురపాలికల్లో చాలామంది ప్లాట్లు కొనుగోలు చేసి నిర్మాణాలు చేపట్టకుండా వదిలేస్తున్నారు. ఇలా జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో వేల సంఖ్యలో ఖాళీ (ప్లాట్లు)స్థలాలున్నాయి. వీటికి వీఎల్‌ (వేకెండ్‌ ల్యాండ్‌ ట్యాక్స్‌) విధించాల్సి ఉంటోంది. అయితే పురపాలికల్లో అధికారులు పట్టించుకోకపోవడంతో వీటికి ఇప్పటివరకు ఎలాంటి పన్నులు విధించని పరిస్థితి నెలకొన్నది. ఇక మీదట ఖాళీ స్థలాలకు వీఎల్‌ పన్ను చెల్లించమంటే కుదరదు. ఆస్తి విలువలో కనిష్ఠంగా 0.05, గరిష్ఠంగా 0.20 శాతం పన్ను ఖరారు చేయనున్నారు. ఖాళీ స్థలాల్లో భవిష్యత్తులో ఇళ్ల నిర్మాణానికి అనుమతి తీసుకోవాలంటే..వీఎల్‌ పన్ను రసీదును జత చేయాల్సి ఉంటోంది. మున్సిపాలిటీల్లో నిధులు లేకపోవడంతో తాత్కాలిక ఉద్యోగుల వేతనాలు, ఇతర ఖర్చులు, అభివృద్ధి పనులకు సైతం ఇబ్బందిగా మారుతోంది. అయితే ఇప్పుడు ఆస్తి పన్ను ద్వారా వచ్చే ఆదాయంతో వేతనాలతో పాటు అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉంది. మార్చి 31 నాటికి ఆస్తి పన్ను మదింపు ప్రక్రియ పూర్తి చేసి కొత్త పన్ను విధానం అమలు చేసేలా కసరత్తు చేస్తున్నట్లు మున్సిపల్‌ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.



ఆస్తి పన్ను నిబంధనలు ఇలా..

నగర శివారు మేడ్చల్‌–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 29 మున్సిపాలిటీలు ఉన్నాయి. 2025–26 ఆర్థిక సంవత్సరంలో నివాస భవనాలకు నిర్మాణ విలువలో కనిష్ఠంగా 0.10 శాతం, గరిష్ఠంగా 1 శాతం ఆస్తి పన్ను పెంచనున్నారు. వాణిజ్య భవనాలకు మార్కెట్‌ విలువలో కనిష్ఠంగా 0.25 శాతం, గరిష్ఠంగా 2 శాతం పన్ను పెరుగుతోంది. పురపాలక చట్టం ప్రకారం 75 గజాల్లోపు ఉన్న భవనానికి ఆస్తి పన్ను పెంపు వర్తించదు. వీటితో పాటు చారిత్రక భవనాలు, ఆసుపత్రులు, పురపాలక భవనాలు, అనాథ, వృద్ధాశ్రమాలకు మినహాయింపు ఉంటుంది.

మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను మదింపునకు ఆదేశాలు

- 2025–26 ఆర్థిక సంవత్సరంలో నూతన విధానం అమలు
- శివారు 29 పురపాలికల్లో వ్యవసాయేతర ఆస్తుల విలువలు సవరించి ఆస్తి పన్ను ఖరారుపై కసరత్తు
- వివరాల సేకరణలో పుర అధికార యంత్రాంగం
- నగర శివారు11 పురపాలికల్లో 40 గ్రామ పంచాయతీల విలీనం

పన్ను మదింపుపై కసరత్తు..

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలోని ప్రస్తుతం 13 పురపాలక సంఘాల నుంచి వివిధ పన్నుల ద్వారా రూ.190 కోట్ల ఆదాయం సమకూరుతుండగా, రంగారెడ్డి జిల్లాలోని 16 మున్సిపాలిటీల నుంచి రూ.175 కోట్లు వసూలు అవుతున్నాయి. ఇదిలా ఉండగా ఇటీవల ప్రభుత్వం మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని 7 పురపాలక సంఘాల్లో సమీపంలోని 28 గ్రామ పంచాయతీలను విలీనం చేయగా, రంగారెడ్డి జిల్లాలో 4 పురపాలక సంఘాల్లో 12 గ్రామ పంచాయతీలు విలీనమయ్యాయి. దీంతో విస్తరించిన ఆయా పురపాలక సంఘాలకు వివిధ పన్నుల ద్వారా ఆదాయం పెరిగే అవకాశమున్నది. మున్సిపాలిటీల్లో పెరిగిన జనాభాకు అనుగుణంగా కాలనీల సంఖ్య కూడా పెరిగింది. ఈ నేపథ్యంలో ఆయా కాలనీల్లో మౌలిక వసతులను కూడా పురపాలక సంఘాలే కల్పించాల్సిన అవసరముండడంతో అందుకు అనుగుణంగా ఆస్తి పన్ను మదింపుపై అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.

కీసరగుట్టలో దర్శనం కోసం క్యూలో భక్తులు



కీసరగుట్ట కిటకిట

కీసర: కీసరగుట్ట శివనామస్మరణతో మార్మోగింది. మహాశివరాత్రి పర్వదినం రోజున శివుడిని దర్శించుకుంటే అంతా మంచి జరుగుతందన్న నమ్మకంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శ్రీరామలింగేశ్వరుడిని దర్శించుకున్నారు. అనంతరం ఐదంతస్తుల రాజగోపురానికి ఎదురుగా ఉన్న శివలింగాలకు పసుపు, కుంకుమ, పాలు, నూనె, నెయ్యితో అభిషేకాలు నిర్వహించారు. మరోవైపు బ్రహోత్సవాల్లో భాగంగా ఆలయంలో వేద పండితులు స్వామివారికి నందివాహన సేవను వైభవంగా నిర్వహించారు. రాత్రి 12 గంటలకు (లింగోద్భవకాలంలో) శ్రీరామలింగేశ్వర స్వామికి సంతతధారాభిషేకం పూజను నిర్వహించారు. సాయంత్రం వరకు దాదాపు లక్షకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. అడిషనల్‌ కలెక్టర్‌ విజయేందర్‌రెడ్డి, రాచకొండ సీపీ సుధీర్‌బాబు, జిల్లా ఉన్నతాధికారులు, డీసీపీ పద్మజా, ఏసీపీ నరేందర్‌గౌడ్‌, అధికారులు దర్శనం త్వరగా అయ్యేలా చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్‌, రాజ్యసభ సభ్యుడు, డాక్టర్‌ కె.లక్ష్మణ్‌, ఎంపీ ఈటల రాజేందర్‌, దేవాదాయ శాఖ కమిషనర్‌ సుబ్రహ్మణ్యం, పలువురు జడ్జిలు, ఉన్నతాధికారులు స్వామివారిని దర్శించుకున్నారు.



గర్భాలయంలో శ్రీరామలింగేశ్వరస్వామివారు



కీసరగుట్ట పూజల్లో ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్‌



విద్యుత్‌ దీపాలతో కీసరగుట్ట ఆలయం





శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు

భక్తులకు పండ్లు పంపిణీ

హబ్సిగూడ: మహాశివరాత్రిని పురస్కరించుకుని యువజన కాంగ్రెస్‌ మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా మాజీ అధ్యక్షుడు కంది శ్రవణ్‌ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం జాగరం చేసే భక్తులకు పండ్లు పంపిణీ చేశారు. వెలుగుగుట్ట శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఉప్పల్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌ రెడ్డి హాజరై భక్తులకు పండ్లు పంపిణీ చేసి మహాశివరాత్రి పండుగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో రఘు, విజయ్‌కుమార్‌, అరుణ్‌ పటేల్‌, ధర్మేంద్ర నాయక్‌, వాసునాయక్‌, ప్రభాకర్‌రెడ్డి, ఉపేందర్‌ రెడ్డి, షేక్‌ షబ్బీర్‌, సుమన్‌, కల్యాణ్‌ తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు పండ్లు పంపిణీ చేస్తున్న పరమేశ్వర్‌ రెడ్డి

విద్యార్థుల్లో పఠనాభ్యాసం పెంపొందించడమే లక్ష్యం

చంపాపేట: ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో పఠనాభ్యాసం పెంపొందిచటమే ఆర్చ్‌ ఫౌండేషన్‌ లక్ష్యమని డైరెక్టర్‌ నిషాంత్‌షా అన్నారు. చంపాపేటలోని కిన్నెర గ్రాండ్‌ సమావేశ మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన ఆర్చ్‌ ఫౌండేషన్‌, ఐఎఫ్‌ఎఫ్‌ ప్రతినిధుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గత రెండేళ్లుగా ఆర్చ్‌ ఫౌండేషన్‌, ఐఎఫ్‌ఎఫ్‌ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థులలో నిరంతర పాఠ్యాంశాల పఠనం, అభ్యసనం పెంపొందించేందుకు పలు కార్యక్రమాలు చేపట్టడంతో పాటు మోటివేషన్‌, స్టడీ మెటీరియల్‌ అందిస్తున్నామన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలపై మంచి పట్టు ఉంటే వారికి కమ్యూనిటీ స్కిల్స్‌ పెరిగి భవిష్యత్‌లో ఆత్మస్థైర్యంతో ఉన్నత శిఖరాలకు చేరుతారని ఆ దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా 40 మంది విద్యార్థులకు, మెమొంటో, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్‌ సీఈఓ సోంకీషా, కోఆర్డినేటర్‌ నివేదిత, ఐఎఫ్‌ఎఫ్‌ ప్రతినిధులు మురుగన్‌, శ్రీనివాస్‌, పాల్గొన్నారు.

